# చిన్నకథ

# తాజ్

– జయసూర్య


''సయ్యదుద్దీన్!''

అతడు వినిపించుకోలేదు. మళ్ళీ పిలిచాను. దగ్గరకు వచ్చాడు. 'కైసా హో!' అన్నాను పరిచయమున్నట్టుగా. సూర్యోదయ కాంతి కిరణాలు తాజ్‌మహల్ పాలరాతి అద్భుత సౌందర్యాన్ని పరవశింపచేస్తున్నాయి. అరుణోదయ సమయంలో తాజ్ అందాలను తనివితీరా చూడాలని యాత్రికులు హడావిడిగా చేరుకొంటున్నారు. కాలం చెక్కిలి పై ఘనీభవించిన ఆ ప్రేమ మందిరాన్ని హృదయంలో పదిలపరుచుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఎక్కువగా విదేశీయులు. కెమేరాలు క్లిక్‌మంటున్నాయి. వయసు మళ్ళిన విదేశీ దంపతులు ప్రేమికులుగా, భంగిమలలో ఆ పాలరాతి స్మృతిమందిర ప్రాంగణంలో ఫోటోలు తీసుకొని సంతృప్తిగా అడుగులు వేస్తున్నారు.

సయ్యదుద్దీన్ బదులుగా చిరునవ్వు. నాకు హిందీ రాదు. మొదటిసారి ఆగ్రా వచ్చాను. నిన్న ఉదయం తాజ్‌మహల్ చూసాను. అప్పుడు ఇంకా సూర్యోదయం కాలేదు. చలిగా వుంది. మళ్ళీ చూడాలనిపించి ఈ వేళ కూడా వచ్చాను. నిన్న ఉదయం సయ్యదుద్దీన్‌తో పరిచయం కేవలం కొన్ని నిముషాలు. పేరు అడిగాను అంతే. ఆ అందాల అద్భుత అంతర్భాగ సమాధి మందిరంలో జహాపనా షాజహాన్, సరసన ముంతాజ్ ప్రశాంతంగా నిద్రిస్తున్నారు. సయ్యదుద్దీన్ వృద్ధుడైనా చూపులు చురుకుగా వున్నాయి. సమాధి మందిరంలో రోజూ ఆ పాలరాతి శయ్యా శిలాఫలకాలను శుభ్రం చేసే సేవకుడు. తలకు లేసు రుమాలు, చినిగినా, ఉతికిన తెల్లటి కఫ్నీ, చేతిలో బకెట్. ముందుగా ధూళి లేకుండా తుడిచి, తడిలేకుండా శుభ్రం చేయటం అతని నిత్యకృత్యం. షాజహాన్, ముంతాజ్‌ల ప్రశాంతతకు భంగం కలగకుండా నిశ్శబ్దంగా రోజూ విధులు నిర్వర్తిస్తుంటాడు. అతని నిమగ్నత. నేను పిలిచినా పలకలేదు. యాత్రికులు సందడిగా మాట్లాడుకొంటున్నారు. మంచును మాయం చేస్తూ బయట సూర్యకిరణాలు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు, సందర్శకుల సంఖ్య పెరగటంతో హడావిడిగా వున్నారు. గైడ్‌లు, విదేశీ యాత్రీకులకు మొగల్ కళాత్మక చిత్ర నైపుణ్యాలను, అపురూప చారిత్రక కుడ్య విశేషాలను బిగ్గరగా వివరిస్తున్నారు. నాలాంటి యాత్రీకులు లోపలికి వెళ్ళటానికి వీలు లేకుండా చుట్టూ రక్షణ వలయం. మళ్ళీ పిలిస్తే, ఏమిటన్నట్టుగా చూసాడు.చేతిలో పది రూపాయల నోటు. నిర్లిప్తంగా పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. నాకు సిగ్గేసింది.

ఇంతలో బాబా అంటూ పదేళ్ళు నిండని ఆ అమ్మాయి అటు వచ్చింది. అందమైన ముఖం. పెద్ద కళ్ళు. సన్నగా, నాజూగ్గా వుంది. జిబ్బా సల్వార్ అద్దాల చెమ్కీ డ్రెస్. గులాబి రంగు ఓణీ. తొలి వేకువలో ప్రేమసౌధంలా అద్భుతంగా వుంది. పావురాలు పైన వాలి ఎగురుతూ స్వాగతం పలుకుతున్నాయి. నమాజు ప్రార్థనలు వినపడుతున్నాయి. యమునా నది, తాజ్ వెనక వియోగ అనురాగ స్మృతి చిహ్నంగా చిక్కి శల్యమై కన్నీటి చారికల ఛాయలతో నిర్వేదంగా అనుభవిస్తున్నట్టుంది. ఆగ్రా ఫోర్టులోని సమ్మాన్ బుర్జ్ టవర్ లోపల బందిఖానాలో షాజహాన్ విషాదహృదయంతో ప్రియురాలి స్మృతిమందిరం తాజ్‌ను చూస్తున్నట్టు నాకు అనిపించింది. హృదయం కదిలింది.

సయ్యదుద్దీన్ చెవిలో, నాకు అర్థం కాని ఉర్దూలో ఆ పాప ఏదో చెప్పింది. యింతలో ఒక ఫారిన్ టూరిస్ట్ జంట ఆ పాపను వెతుక్కుంటూ అక్కడకు వచ్చారు. తాజ్ ముందు ప్రాంగణంలో ఫోటోల హడావుడిలో ఆ పాలరాతి బెంచ్‌పైన వాళ్ళు తమ బ్యాగ్ మరిచిపోవటం. ఆ పాప వస్తుండగా చూసి సెక్యూరిటీ గార్డుల సాయంతో వాళ్ళకి అప్పగించటం. ఆ బ్యాగ్‌లో వీసా పత్రాలు, డాలర్ల క్యాష్ అన్నీ తిరిగి దొరకటంతో వాళ్ళ సంతోషం. కెమేరాలు క్లిక్‌మన్నాయి. సయ్యదుద్దీన్ కళ్ళల్లో ఆనంద బాష్పాలు. కూతురును అక్కున చేర్చుకున్నాడు.




★